## క్లుప్తంగా

### గరుడ వాహనంపై సీతా రాముల గ్రామోత్సవం



బ్రాహ్మణపల్లిలో గరుడ వాహనంపై సీతారాముల గ్రామోత్సవం

**మర్రిపాడు (ఆత్మకూరురూరల్):** మండలంలోని బ్రాహ్మణపల్లిలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సీతారాముల ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై విశేష పుష్పాలంకరణ చేసి మేళతాళాలు బాణసంచా మోతలతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారికి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు.

### ఘనంగా గంధ మహోత్సవం



దర్గా వద్ద అన్నదానం

**చేజర్ల (సోమశిల):** అనంతసాగరం మండలంలోని సోమశిలలో హజరత్ సయ్యద్ మౌలాలి సాహెబ్ 15వ గంధ మహోత్సవాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో దర్గాను దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ శోభ, సయ్యద్ అబ్దుల్ రెహమాన్, పెద్ద కాలేషా, పాతపాటి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

### నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయం

**కలిగిరి:** మండలంలోని కమ్మవారిపాళెంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆలయ ధర్మకర్త కాట్రగుంట వెంకటసుబ్బయ్య తెలిపారు. బ్రహ్మణక్రాకకు చెందిన వేదపండితుడు పరాంకుశం రఘుప్రసాద్‌స్వామి పర్యవేక్షణలో ఈ నెల 11వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఉత్సవాలు చేయడానికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అంకురార్పణ వేదారంభం, భగవత్ ప్రార్థన, హారతి కార్యక్రమాలు జరుగుతాయి. మంగళవారం వేదాపారాయణం, రక్షాబంధనం పూజ, విష్వక్సేన పూజ, కుంభావాహన, హారతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. బుధవారం అగ్నిప్రణయనం, క్షీరాధివాసం, జలాధివాసం, భక్తులతో పాలాభిషేకం, ధ్వజస్తంభ కలశాల గ్రామోత్సవం జరగనుంది. చివరి రోజు గురువారం సుప్రభాతం, ధ్వజస్తంభ ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తారు.

### 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**కావలి రూరల్:** మండలంలోని అన్నగారిపాళెం పంచాయతీ ఓట్టూరు మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తునట్లు శనివారం ప్రిన్సిపల్ ఎస్.ఇందిరా తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు https:// apms. apgov. in/ apms వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75, ఓసీ, బీసీలకు రూ.150 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

# సర్కార్ మెరికలు

గతంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకే పరిమితమైన మార్కులు, ర్యాంక్‌లను ఇప్పుడు సర్కారీ బడుల విద్యార్థులు కొల్లగొట్టాతున్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు, కల్పిస్తున్న సదుపాయాలు, అందిస్తున్న నాణ్యమైన విద్యా ప్రమాణాలతో పేదింటి బిడ్డలు సరస్వతీ పుత్రులుగా గుర్తింపు తెచ్చారు. శనివారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు టాప్‌గా నిలిచారు. ఫలితాల్లో బాలికలు ప్రతిభ చాటుకున్నారు.

- పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ
- అధిక శాతం బాలికలు ఉత్తీర్ణత



ఆత్మకూరు జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థినులను అభినందిస్తున్న డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్

**ఆత్మకూరు:** పదో తరగతి ఫలితాల్లో ఆత్మకూరులోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఏపీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి తమ సత్తా చాటారు. ఈ ఫలితాల్లో బాలికల హవా కొనసాగింది. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసింది. అమ్మఒడి, జగనన్న విద్యాకానుకలు, జగనన్న గోరుముద్ద తదితర పథకాలతో ప్రోత్సాహం ఇస్తుండడంతో పాటు ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్‌కు దీటుగా ఆధునిక వసతులు కల్పించింది. ఇంగ్లిష్ మీడియంతో పాటు ట్యాబ్‌లు అందించి బైజుస్‌తో ఒప్పందం చేసుకుని నాణ్యమైన విద్యకు శ్రీకారం చుట్టింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఏపీ గురుకుల పాఠశాల 94 శాతం ఫలితాలు సాధించింది. మొత్తం 72 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరు కాగా 68 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ అన్నపూర్ణ తెలిపారు. గురుకుల పాఠశాల విద్యార్థిని బి.శ్రీలక్ష్మి 572 మార్కులు సాధించి పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. మరో విద్యార్థిని డి.రిషిత 563 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలవగా, బి.తపస్విని, డి.సరిత 556 మార్కులు సాధించి తృతీయ స్థానాల్లో నిలిచారు. ఎల్‌ఆర్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 16 మంది పది పరీక్షలకు హాజరు 15 మంది ఉత్తీర్ణులు కావడంతో 94 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలగా నిలిచినట్లు హెచ్‌ఎం లక్ష్మి తెలిపారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల 80 శాతం పదిలో ఫలితాలు సాధించినట్లు హెచ్‌ఎం శ్రీనివాసులు తెలిపారు. పాఠశాల విద్యార్థిని ఆకుల రేణుక 566 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా షేక్ షాహీదా 561 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం తెలిపారు. పాఠశాల నుంచి మొత్తం 129 మంది పది పరీక్షలకు హాజరు కాగా 103 మంది ఉత్తీర్ణత సాధించడంతో 80 శాతం ఫలితాలు వచ్చినట్లు ఆయన తెలిపారు. పాఠశాల నుంచి పది పరీక్షలకు హాజరైన వారిలో 25 మందికి పైగా విద్యార్థినులు 500పైగా మార్కులు సాధించినట్లు హెచ్‌ఎం శ్రీనివాసులు వివరించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పది ఫలితాల్లో 63 శాతం ఫలితాలు సాధించినట్లు హెచ్‌ఎం పుల్లయ్య తెలిపారు. మొత్తం 60 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 38 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. పాఠశాలకు చెందిన సీహెచ్ కిరణ్ 550 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా గంధళ్ల సంతోష్ 522 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం వివరించారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాల నుంచి 25 మందికి పైగా 500 మార్కులకుపైగా సాధించడంతో వారిని ఉపాధ్యాయులను మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్ విద్యార్థులకు స్వీట్లు తినిపించి అభినందించారు. మొత్తం మీద ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటాపోటీ మార్కులు సాధించడంతో పలువురు అభినందించారు.



బి శ్రీలక్ష్మి (572 మార్కులు) గురుకుల పాఠశాల



ఆకుల రేణుక (566 మార్కులు) బాలికల జెడ్పీహెచ్‌ఎస్



డి రుషిత (563 మార్కులు) గురుకుల పాఠశాల



షేక్ షాహీదా (561 మార్కులు) బాలికల జెడ్పీహెచ్‌ఎస్



డి సరిత (556 మార్కులు) ఏపీ గురుకుల పాఠశాల



బి తపస్విని (556 మార్కులు) ఏపీ గురుకుల పాఠశాల

## చిలకపాడులో చదువుల దివ్వెలు

**మర్రిపాడు(ఆత్మకూరురూరల్):** మర్రిపాడు మండలం చిలకపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించి తమ ప్రతిభను చాటారు. జి మహేష్ (534 మార్కులు), బి వైష్ణవి (510 మార్కులు)తో పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. మొత్తం 14 మంది పరీక్షలు రాయగా అందరూ పాస్సై చిలకపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రతిష్టను ఇనుమడింపజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్ తాన్య మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం వెనుక గ్రామస్తులతో పాటు చిలకపాడు చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల పాత్ర ప్రధానంగా ఉందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు అంకితభావంతో చేసిన బోధన, విద్యార్థుల క్రమశిక్షణ తమ పాఠశాల కీర్తిని నిలబెట్టాయని తెలిపారు.



జి మహేష్ (534 మార్కులు)



బి వైష్ణవి (510 మార్కులు)

## అల్లూరు టాపర్లకు అభినందనలు

**అల్లూరు:** అల్లూరులోని రామకృష్ణా జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు పదో తరగతిలో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన మేకల హేమచంద్రిక (567 మార్కులు)ను పాఠశాల ప్రిన్సిపల్ ఓ శ్రీనివాసులు, సిబ్బంది అభినందించారు. రెండో స్థానం సాధించిన పులి పల్లవి (538 మార్కులు), మూడో స్థానంలో నిలిచిన పుల్లా మహిత (524 మార్కులు), నాల్గో స్థానంలో నిలిచిన షేక్ రహీద్ (521 మార్కులు)లను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఓ శ్రీనివాసులు

## నమ్మిన ప్రజలకు అండగా ఉంటాం



పడమటినాయుడుపల్లిలో హైలెవల్‌కెనాల్ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- హైలెవల్ కెనాల్ నిర్వాసితులకు న్యాయం చేస్తాం
- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

**మర్రిపాడు (ఆత్మకూరురూరల్):** తమను నమ్ముకున్న ప్రజల సమస్యల పరిష్కారం కోసం పది అడుగులు ముందుకు వేసి వారికి అన్ని విధాలా అండగా ఉంటామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పడమటినాయుడుపల్లిలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా అందిన పథకాలను వివరించారు. పలువురు గ్రామస్తులు తమ గ్రామం సోమశిల హైలెవల్ కెనాల్ పనుల్లో భాగంగా ముంపు ప్రాంతంగా అధికారులు గుర్తించారన్నారు. అయితే పరిహారం అందజేసే విషయంలో సంవత్సరాలుగా గడిచిపోతున్నా సమస్యలు యథాతథంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ విషయమై అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే భూసేకరణ సమస్యలు, రెవెన్యూ విభాగాలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యేకి విన్నవించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ పడమటినాయుడుపల్లి పంచాయతీ ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా, ఎటువంటి ఇబ్బందులు వచ్చినా అండగా ఉండి వారికి అన్ని విధాలా చేయూతనిస్తామన్నారు. ప్రభుత్వం తరపున పరిష్కరించాల్సిన సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా నిర్దేశిత వ్యవధిలోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, భీమవరం, బూదవాడ సొసైటీ చైర్మన్లు సోమల మాధవరెడ్డి, చెన్ను శ్రీధర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ జయమ్మ, మాజీ సర్పంచ్ గిన్నె వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు దుగ్గిరెడ్డి కృష్ణ ప్రసాద్‌రెడ్డి, మన్నే బాలకొండారెడ్డి, రామ్ గోపాల్‌రెడ్డి, చీర్ల దయాకర్‌రెడ్డి, వేమన బాలాజీ, సుబ్రహ్మణ్యం, ఆత్మకూరు తహసీల్దారు ఆనందరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్‌ఖాన్, వివిధ శాఖల ఏఈలు, మండల స్థాయి అధికారులు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

### మొక్కజొన్న రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోండి

**ఉదయగిరి:** ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని ఉదయగిరి, వరికుంటపాడు, సీతారామపురం మండలాల్లోని మొక్కజొన్న పంట పంట సాగు చేసిన రైతులు సమీప రైతు భరోసా కేంద్రాల్లో దిగుబడి విక్రయానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ పవన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను క్వింటా రూ.1,962 మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ప్రభుత్వ జీఓ జారీ చేసిందన్నారు. పంట నిల్వ ఉన్న రైతులు వారం లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఉదయగిరి, సీతారామపురం మండలం బసినేనిపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంటను కొనుగోలు చేస్తామన్నారు. తడిసిన, రంగు మారిన దిగుబడిని కొనుగోలు చేయమని, కొనుగోళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తామన్నారు. దళారులు రైతుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం ముందని, వీఏఏలు రైతు ఇంటికెళ్లి నిల్వలను పరిశీలించి రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. లేదంటే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కయనీయం నృసింహుని కల్యాణం

**ఉదయగిరి (వింజమూరు):** మండంలోని నల్లగొండ్ల క్షేత్రం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి వారి కల్యాణోత్సవాన్ని కనుల పండుగా నిర్వహించారు. దేవదేవేరుల ఉత్సవ విగ్రహాలను విశేష పుష్పాలతో అలంకరించి కొండపై నుంచి ఆలయ అర్చకులు కల్యాణ వేదికకు తీసుకొచ్చారు. శ్రీవారికి ఎదురుకోలు ఉత్సవం నిర్వహించారు. అగ్ని హోమాలు, ఉత్సవ హోమాలు నిర్వహించారు, కల్యాణ ఉత్సవ ఘట్టాన్ని, స్వామివారి కల్యాణ వైభోగాన్ని వేద పండితులు భక్తులకు వివరించారు. ఆలయ మాజీ ధర్మకర్త అన్నపురెడ్డి మురళీధర్‌రెడ్డి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలను దేవస్థానానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కల్యాణాన్ని వీక్షించారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నమయ్య సంకీర్తలను అలరించాయి. ఆలయ ఉభయకర్తలుగా నంభూరి మనోజ్-లత, అన్నపురెడ్డి మురళీధర్‌రెడ్డి- లావణ్య దంపతులు, గాంధీబొమ్మ సెంటర్ వారు వ్యవహరించారు. కల్యాణ ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అన్నపురెడ్డి మోహన్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. భారీ అన్నదానం నిర్వహించారు. భక్తులకు మజ్జిగా, లడ్డూ, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరి చిరంజీరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, కలిగిరి ఎంపీపీ మెట్టుకూరి శిరీష, దుత్తలూరు జెడ్పీటీసీ లెక్కల లక్ష్మీకాంతమ్మ, అంకినపల్లి ఓబుల్ రెడ్డి, మాజీ ధర్మకర్తలు ఎల్‌సీ మాలకొండారెడ్డి, ఎల్‌సీ కొండారెడ్డి, బొగ్గిరెడ్డి నాగిరెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ ప్రమీల, మాజీ సర్పంచ్ నరసింహరెడ్డి, లెక్కల శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

**వేడుకగా హయా, గజోత్సవం**

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి హయా, గజ వాహనాలపై స్వామి, అమ్మవార్ల విగ్రహాలను ఉంచి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి అమ్మవార్లను కొండపై నుంచి కింద తీసుకొచ్చే ఘట్టం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ఆకు పూజ అనంతరం స్వామివార్ల గ్రామోత్సవం సాగింది. భారీగా బాణసంచా, అన్నదానం నిర్వహించారు. సంస్కృతిక కార్యాక్రమాలు నిర్వహించారు. కలిగిరి సీఐ సాంబశివరావు, వింజమూరు ఎస్సై రంగానాథ్‌గౌడ్‌లు బందోబస్తు నిర్వహించారు.

**ఉత్సవాల్లో నేడు**

శ్రీలక్ష్మీనరసింహా స్వామి బ్రహ్మత్సవాల్లో భాగంగా మంగళవారం అలకలతోపు నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్త అన్నపురెడ్డి మోహన్‌రెడ్డి తెలిపారు. అమ్మవారు దక్షిణం వైపు మెట్ల ద్వారా, శ్రీవారు తూర్పు వైపు మెట్ల ద్వారా పరుగులు తీయడం అలకలతోపు అని వేద పండితులు వివరించారు.



కల్యాణానికి హాజరైన భక్తులు

## వైభవంగా గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్టోత్సవం

**ఉదయగిరి:** మండలంలోని అప్పసముద్రం పంచాయతీ గంగపాడు వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు గర్తపూజ, ప్రతిష్ట హోమాలు, యంత్ర, విగ్రహ, ధ్వజ, శిఖర కలశ, ప్రాణప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మ వారికి మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మోడి రామాంజనేయులు, నాయకులు చేజర్ల సుధాకర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

## దొంగ అగ్రిమెంట్లతో టీడీపీ భూఆక్రమణ

- నా భూమి కాజేయాలని చూస్తున్నారు
- రైతు సాయియాద ఆరోపణ

**అనుమసముద్రంపేట:** మండలంలోని గుడిపాడుకు చెందిన టీడీపీ నాయకులు నా భూమిని కాజేయాలని చూస్తున్నారని కందుకూరు చెందిన సాయియాద అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో తన తండ్రి గుడిపాడు పంచాయతీ కొత్తపల్లి వద్ద భూములు కొనుగోలు చేశారని, ఆ భూములకు అప్పుడే రిజిస్టర్ చేయించుకున్నట్లు తెలిపారు. వృత్తిరీత్యా కందుకూరు, హైదరాబాద్‌లో వ్యాపారాలు చేసుకుంటున్నామని, అప్పుడప్పుడు గ్రామానికి వచ్చి భూములను చూసుకుంటున్నామని తెలిపారు. దాదాపు 16 ఎకరాల భూమిని అప్పటి ఎంపీటీసీ, టీడీపీ నాయకులు దేవరాల హజరత్తయ్య, పెంచలయ్య, సుబ్బారావు, కోటేశ్వరరావు మరికొంత మంది కలిసి దొంగ అగ్రిమెంట్లు సృష్టించి మా భూములు కాజేయాలని చూస్తున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకుని కోర్టుకు వెళ్లడంతో కోర్టు తీర్పు తమకు అనుకూలంగా ఇచ్చినట్లు తెలిపారు. అది జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు, వారి అనుచరులు భూమిని దురుద్దేశ పూర్వకంగా ఆక్రమించుకుంటారనే భయంతో ఏఎస్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే భూముల వద్ద గొడవలు సృష్టించేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నం చేయడంతో ఎస్సై నరేష్ తన సిబ్బందితో కొత్తపల్లికి చేరుకుని విచారణ చేస్తే అక్కడ ఎటువంటి గొడవలే లేవని తెలుసుకుని వెనుదిరిగారని చెప్పారు.

## దర్గాలో సెల్‌ఫోన్ దొంగల హల్‌చల్

**అనుమసముద్రంపేట:** మండలంలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్‌దర్గాలో ఇద్దరు వ్యక్తులు సెల్‌ఫోన్ చోరీ చేయడంలో ఆరితేరిపోయారు. ఆదివారం హైదరాబాద్‌కు చెందిన యువతి అళ్లగడ్డకు చెందిన మస్తాన్‌తో కలిసి సెల్‌ఫోన్ దొంగలిస్తుండగా పట్టుబడ్డారు. వీరు రాత్రి పూట భక్తులు నిద్రపోయే సమయంలో సెల్‌ఫోన్ దొంగలిస్తూ ఉంటారు. అయితే ఆదివారం ఈ విషయం సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో ఏఎస్‌పేట పోలిసులకు సమాచారం అందించారు.

# నాడు ఘనం.. నేడు దైన్యం

- దుస్థితిలో ఆత్మకూరు రెడ్‌క్రాస్
- నేడు అంతర్జాతీయ రెడ్‌క్రాస్ దినోత్సవం




ఆత్మకూరు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ

**ఆత్మకూరు:** భారతదేశంలోనే తొలిసారిగా గ్రామీణ ప్రాంతంలో రెడ్‌క్రాస్ సొసైటీ బ్రాంచ్‌ను ఆత్మకూరులో ఏర్పాటు చేసి రికార్డ్ సృష్టించారు. 2003లో గాంధీ జయంతి రోజున దాదాపు 150 మంది జీవిత కాల సభ్యత్వాలతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆత్మకూరు శాఖను ఏర్పాటు చేశారు. అప్పటి ఆత్మకూరు ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్య ఆర్థిక సహాయ సహకారాలతో 'రక్తనిల్వ కేంద్రం' నిర్వహించేలా ఏర్పాటు చేశారు. నాటి నుంచి దశాబ్ద కాలంపైగా సొసైటీ ద్వారా స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు, మెడికల్ క్యాంపులు, క్యాన్సర్, హెపటైటీస్‌బీ, హెచ్‌ఐవీ తదితర వ్యాధులపై అవగాహన, ఉచిత మందుల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. రక్త నిల్వ కేంద్రం ద్వారా ఆత్మకూరుతో పాటు ఉదయగిరి, వింజమూరు తదితర ప్రాంతాల రోగులకు రక్త సరఫరా అందజేసే వారంటే సంస్థ నిర్వహణ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. 150 మంది జీవితకాల సభ్యులతో ప్రారంభమైన సొసైటీ సభ్యత్వం అనంతర కాలంలో 274కి చేరింది.

**సేవలకు గుర్తింపుగా**

ఆత్మకూరు రెడ్‌క్రాస్ సంస్థ దేశంలోనే తొలిసారిగా గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటైనా సేవా కార్యక్రమాల్లో నెల్లూరు, కావలి, గూడూరు, తదితర శాఖల కంటే మిన్నగా సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఏటా మే 8వ తేదీన రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా భారీ స్థాయిలో రక్తదాన శిబిరం నిర్వహించి వందలాది యూనిట్ల రక్తం జిల్లా కేంద్రానికి సరఫరా చేయడం జరిగేది. దీంతో అప్పటి ఆత్మకూరు తహసీల్దార్ (ప్రస్తుత నెల్లూరు డీఆర్‌ఓ) సీహెచ్ వెంకట నారాయణమ్మ కలెక్టర్ అనుమతితో సొసైటీకి సొంత భవనం నిర్మాణం కోసం పట్టణంలో స్థలం కేటాయించారు. అప్పట్లో పాలకవర్గ తరచూ సమావేశాలు నిర్వహిస్తూ సేవా కార్యక్రమాల షెడ్యూల్ ప్రకటించేవారు. ఆ మేరకు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు.

**ఇదంతా నాటి ఘనతే**

ప్రస్తుతం ఆ పరిస్థితి లేక సమావేశం నిర్వహించక రెడ్‌క్రాస్ సొసైటీ ఆత్మకూరు శాఖ నిర్వీర్యం అయింది. దీనికితోడు ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి నిర్వహణలో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేయడంతో రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు కుంటుపడ్డాయి. అసలు ఆత్మకూరులో రెడ్‌క్రాస్ సంస్థ ఉందానే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే సభ్యత్వాలు కలిగిన వారి ఓట్ల కోసం పలకరింపు తప్ప రెడ్‌క్రాస్ ఉనికే లేకుండా పోయింది. పాత ప్రభుత్వ ఆస్పత్రి భవనంలో అప్పట్లో సంస్థ ఏర్పాటు చేయడంతో ఇప్పటికీ అక్కడే నామమాత్రంగా సొసైటీ కొనసాగుతోంది. ప్రభుత్వం కేటాయించిన స్థలం సైతం వినియోగించకపోవడంతో దానిని అనంతర పరిణామాల్లో మున్సిపల్ మార్కెట్ నిర్మాణంలో కలిపేసుకున్నారు.

**పూనర్వవైభవం తేవాలి**

రెండు దశాబ్దాలుగా రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా విశేష సేవా కార్యక్రమాలు నిర్వహించాం. పలువురు దాతలు సహకరించారు. ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఏర్పడడంతో రక్తనిల్వ కేంద్రం బదిలీ చేయాల్సి వచ్చింది. మళ్లీ త్వరలోనే సభ్యత్వం కలిగిన వారందరూ సమావేశమై పునర్వ వైభవం తెచ్చేలా సొసైటీ కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు, రెడ్‌క్రాస్ మాజీ కార్యదర్శి, ఆత్మకూరు

## విజ్ఞాన దర్శిని

- నేటి నుంచి శిక్షణా తరగతులు
- జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో

**చేజర్ల(సోమశిల):** నిశ్శబ్ద వాతావరణంలో విజ్ఞానాన్ని అందించేవే గ్రంథ బాండాగారాలు. ఇక్కడ విద్యార్థులకు కావలసిన అన్ని విషయాలు ఒకే చోట దొరుకుతాయి. దేశ చరిత్రలో గ్రంథాలయాలకు ఓ స్థానం ఉంది. మహాకవుల కలాల నుంచి జాలువారిన విజ్ఞాన, సామాజిక, హాస్య రచనల పుస్తకాలకు కేంద్రాలుగా గ్రంథాయాలు విరాజిల్లుతున్నాయి. స్వాతంత్ర్య సమరానికి ఉత్సాహాన్ని నింపాయి.

**జిల్లాలో 671 గ్రంథాలయాలు**

జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి అన్ని గ్రంథాలయాల్లో విజ్ఞాన దర్శిని కార్యక్రమంలో భాగంగా వేసవి విజ్ఞాన శిబిరం, శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. విద్యార్థుల్లో పఠనా శక్తిని పెంపొందించేందుకు, వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ వేసవి శిక్షణ తరగతులు తోడ్పడుతాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖా గ్రంథాలయాల్లో కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలు ఉంటాయి. విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు అనేక కార్యక్రమాలు ఉండనున్నాయి. పిల్లల్లో భయాన్ని పోగొట్టేందుకు కథలు చెప్పిస్తారు. డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, ఉల్లాసాన్ని కలిగించేందుకు పాటలు పాడడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ వేసవి శిక్షణా శిబిరం జూన్ 11 వరకు జరగనుంది. 'యు లవ్ రీడింగ్' అనే కార్యక్రమాన్ని విద్యావంతులందరూ ప్రోహించాలని కోరుతున్నారు. ప్రతి రోజూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు ఈ వేసవిలో రోజూ పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం కేంద్ర గ్రంథాలయం నుంచి అనేక కొత్త పుస్తకాలు వచ్చాయి. పిల్లల కథల పుస్తకాలు, సైన్సు ప్రాజెక్ట్‌లు, పెద్ద వాళ్లకు వంటలకు సంబంధించిన పుస్తకాలు, మహిళలకు నవలలు, ఆధ్యాత్మిక పుస్తకాలు ఉన్నాయి.



చదువుకొంటున్న విద్యార్థులు

**చదువంటే నాకు ఇష్టం**



చదువంటే ఎంతో ఇష్టం. విద్యార్థుల కోసం వేసవి శిక్షణ తరగతులు గ్రంథాలయాల్లో పెట్టడం ఎంతో మేలు. ప్రతి రోజూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో మంచి కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో విద్యార్థుల్లో మరింత ఉత్సాహం పెరిగింది.

– జి గాయత్రి, 4వ తరగతి

**పుస్తకాలు ఎంతో ప్రయోజనం**



గ్రంథాలయాల్లో పుస్తకాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయని రమణయ్య తెలిపారు. విజ్ఞానంతో పాటు వారిలోని సృజనాత్మకత వెలితీయ్యవచ్చునని ఆయన అన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో ఎంతో మేలని తెలిపారు.

– పీవీ రమణయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు, వరికుంటపాడు, అనంతసాగరం మండలం